# తత్వం

"నాకు తెలీక అడుగుతాను నీ భార్యకి రెండు కొమ్ములున్నాయా? లేకపోతే ఆకాశం మీంచి గాని ఊడిపడిందా?" అడిగాడు సురేంద్ర.

"ఇంతకీ ఏమైంది" అన్నాడు సుబ్బారావు అసహనంగా.

"నీతో నాకున్న స్నేహాన్ని పురస్కరించుకుని అడుగుతున్నాను. మా ఆవిడ మీ ఇంటికెళితే మీ శ్రీమతికిటికీలో నుంచే సమాధానం ఇచ్చి పంపేసిందట. లోపలకు పిలిచి మాట్లాడితే ఏం పోయింది?"

"సారి సురేంద్రా. దాని తత్వమే అంత ఏమి చేయమంటావ్? ఆవిడ తరపున నేను అపాలజీ కోరుకుంటున్నాను సరేనా." సురేంద్ర చేతులు పట్టుకున్నాడు సుబ్బారావు.

మరి మాట్లాడలేదు సురేంద్ర.

❖ ❖ ❖

అది ఆదర్శనగర్. పేరుకు తగ్గట్టుగానే కాలనీలన్నింటిలో ఆదర్శమైంది. ఒకరి కష్టంలో మరొకరు పాలు పంచుకుంటూ ఎన్నాళ్ళ నుంచో ఆ కాలనీ వాసులంతా ఎంతో ఐకమత్యంగా ఒకే కుటుంబ సభ్యుల్లా మెలుగుతున్నారు. గత కొన్నేళ్ళుగా సుబ్బారావు ఆ కాలనీలో ఒంటరిగా ఉంటున్నా ఒంటరితనం ఫీల్ కాలేదంటే అందుకు కారణం అక్కడి వారి కలుపుగోలు తనమే. ఈ మధ్యే జెమ్‌షెడ్‌పూర్ వెళ్ళి తన కుటుంబాన్ని తీసుకొచ్చాడు.

సుబ్బారావు భార్య వచ్చిందన్న వార్త కాలనీలో గుప్పుమనడంతో మహిళలంతా మూకుమ్మడిగా అతడి ఇంటి మీదకు దాడిచేశారు.

వచ్చిన వాళ్ళందరికీ టీ కలిపిచ్చింది రుక్మిణి.

"మా రుక్మిణమ్మ సాక్షాత్తు రుక్మిణీదేవే. అందాల రాశి. అపరంజి బొమ్మ" అంటూ ఆమెను తెగ పొగిడివెళ్ళిపోయారు.

"ఏమిటండి ఇది. వచ్చీ రాగానే జూలోని జంతువుని చూడ్డానికొచ్చినట్టు వీళ్ళంతా..." ముఖం చిట్లించింది రుక్మిణి.

"ఆ మాత్రానికే ఆగ్రహిస్తే ఎలా డియర్. మీ వాళ్ళు నీకు పొరపాటున రుక్మిణి అని పేరుపెట్టారు. సత్యభామ అని పెట్టుంటే సరిగ్గా సూటయ్యేది" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

"చాల్లేండి పరిహాసం. మీరేమనుకున్నా నన్ను చూడటం కోసం అంతా ఒక్కసారి అలా కట్టకట్టుకుని రావడం నాకు నచ్చలేదు"

"నువ్వీ కాలనీలో కొత్తగా అడుగుపెట్టావు కదా! పైగా నా భార్యవి. ఎలా ఉంటావోనన్న ఆదుర్దాతో వచ్చారు. నా కంటే నువ్వే నయం. ఇలా వచ్చావో లేదో అందరి

మన్ననల్ని పొందావు" మందహాసం చేశాడు సుబ్బారావు.

"వాళ్ళ పొగడ్తలేం నాకక్కర్లేదు. నన్నిలా ఉండనిస్తే చాలు" రుసరుసలాడుతూ అక్కడనుంచి వెళ్ళిపోయింది రుక్మిణి.

అర్ధాంగి నైజాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలీడం లేదు సుబ్బారావుకి. ఏదో చిన్న జాబ్ చేస్తుండడం వల్ల పెళ్ళైన నాటి నుంచి ఇంతవరకు పుట్టింట్లోనే ఉండిపోయింది. తనే సెలవుల్లో అక్కడికి వెళ్ళొస్తుండే వాడు. మళ్ళీ ఇన్నాళ్ళకి ఉద్యోగానికి రిజైన్ చేసి వచ్చేసింది. ఆమెతో కలిసి కాపురం చెయ్యడం ఇదే ప్రథమం.

అంటీ ముట్టనట్లుండే ఆమె స్వభావం కలివిడిగా తిరిగే కాలనీవాసులెవ్వరికీ కొరుకుడు పడడం లేదు.

భార్య సినిమా ప్రపోజలు పెట్టడంతో ఆ రోజు ఆఫీసు నుంచి పెందలాడే ఇంటికొచ్చాడు సుబ్బారావు.

అప్పటికే సింగారించుకుని సిద్ధంగా ఉంది రుక్మిణి.

"ఇక్కడివాళ్ళ ధోరణేమీ నాకు నచ్చడంలేదు" అంది రుక్మిణి భర్తకు కాఫీ కప్పు అందిస్తూ.

"మళ్ళీ ఏమైంది" అడిగాడు అసహనంగా.

"వదినగారూ, వంట అయిపోయిందా? అన్నయ్య గారింకా ఆఫీసు నుంచి రాలేదా? ఇలా నేనేదో తీరిగ్గా కూర్చున్నట్టు సవాలక్ష పలకరింపులు. నాకీ వరసలంటే వళ్ళు మంట. ఇవాళ తెగేసి చెప్పేశానులెండి. పిలవవలసి వస్తే పేరు పెట్టి పిలవండని"

భార్య ధోరణికి మతిపోయింది సుబ్బారావుకి. "చూడు రుక్కూ వరసలు పెట్టి పిలుచుకోవడంలో తప్పలేదు. అలా పిలవడం వల్ల మనలో ఆత్మీయతా భావన అలవడుతుంది. ఒకే కుటుంబ సభ్యులమన్న భావం కలుగుతుంది. ఫలితంగా ఒకరికొకరం చేదోడు వాదోడుగా ఉండగలుగుతాం. అందువల్లే సాధారణంగా సన్నిహితుల్ని పేర్లుపెట్టి పిలుచుకోరు" వివరణ ఇచ్చాడు సుబ్బారావు.

"మీరెన్ని చెప్పండి, నా కలా వరసలు పెట్టి పిలిస్తే ఇష్టం ఉండదు. అలా అని వాళ్ళ మీద నాకు కోపం లేదు సుమండి".

"సరేలే, ఇంతకీ మోహన్ ఏడీ?" మాట మార్చాడు సుబ్బారావు.

"అడుగో.. బూట్లు తొడుక్కుంటున్నాడు"

పిల్లిలా నెమ్మదిగా చడీచప్పుడు కాకుండా వెనక నుండి వెళ్ళి మోహన్‌బాబు కళ్ళు మూసాడు సుబ్బారావు.

"డాడీ" అంటూ చేతులు విప్పాడు మోహన్.

ముగ్గురూ మోటారు బైకు ఎక్కారు.

బండి శబ్దమవడంతో పొరుగున వున్న మాధవ రావు దంపతులు బయటకొచ్చారు.

" సినిమాకెళుతున్నాం" నవ్వుతూ అన్నాడు సుబ్బారావు.

"మయూరి థియేటర్ కెళ్ళండి" సలహా ఇచ్చాడు మాధవరావు.

"అలాగే"

"వద్దు. లీలామహల్‌కి వెళ్ళండి. దాంట్లో బొమ్మరిల్లు ఆడుతోంది. చాలా బావుంటుంది" అన్నది మాలతి.

అన్నిటికి 'అలాగే' అనడం సుబ్బారావు వంతైంది.

"మీకసలు బుద్ధిలేదు. మనం ఎక్కడికెళుతున్నామో అందరికీ విన్నవించుకోవాలా?" అంటూ దారిలో మండిపడ్డది రుక్మిణి.

"అన్నిటికీ కోపమైతే ఎలా డియర్. చూస్తూ మాట్లాడకుండా వెళ్ళిపోతే ఏం బావుంటుంది చెప్పు"

పెనిమిటి మాటలు రుక్మిణికి రుచించినట్లులేదు.

అందుకేనేమో సినిమా హాలుకెళ్ళేంత వరకు మరి నోరు మెదపలేదు.

ఆవేళ ఆదివారం.

ఆఫీసుకు సెలవు కావడం వల్ల ఇంట్లోనే కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు సుబ్బారావు.

హాల్లో తీరిగ్గా కూర్చుని చీరకు ఫాలు కుడుతోంది రుక్మిణి.

"మమ్మీ... మమ్మీ... కిరణ్ అంకుల్ ఇంటి దగ్గర బోలెడంత మంది ఉన్నారు" అన్నాడు మోహన్‌బాబు పరుగెత్తుకుంటూ వచ్చి.

"నీకెన్నిసార్లు చెప్పాలి, వాడిని అంకుల్ అని పిలవవద్దని. టాటాలో ఉన్నాడే మా తమ్ముడు గిరిధర్ వాడే నీ అంకుల్. ఇంకెవర్నీ అలా పిలవకు" కొడుకును మందలించింది రుక్మిణి.

కిరణ్ పేరు చెవుల్లో పడటంతో గభాలున లేచి నిలబడ్డాడు సుబ్బారావు. నిన్న వాడికి ఒంట్లో బాగోలేకపోతే తనే దగ్గరుండి ఆస్పత్రికి తీసుకెళ్ళాడు. ఇప్పుడెలా వుందో ఏమిటో! కీడును శంకిస్తోందతడి మనసు.

అంతలోనే కిరణ్ గుండెపోటుతో మరణించాడన్న కబురు మోసుకొచ్చారు కాలనీవాసులు.

ఆ వార్తకు షాకయ్యాడు సుబ్బారావు. మరుక్షణం తేరుకుని, "రుక్కూ!పాపం కిరణ్ పోయాడట" అన్నాడు గబగబా షర్టు తొడుక్కుంటూ.

ఆ మాటకు ప్రూన్పడిపోయింది రుక్మిణి.

ఆమె సమాధానం కోసం చూడకుండా రివ్వున బయటకు వెళ్ళిపోయాడు

సుబ్బారావు.

రుక్మిణి మనస్తత్వం కాలనీవాసులెవ్వరికి మింగుడు పడడంలేదు. తలొకరు తలోరకంగా చెవులు కొరుక్కోసాగారు. అవి తన చెవిలో కూడా పడటంతో బాధ పడటం మినహా అర్థాంగినేమీ అనలేకపోతున్నాడు సుబ్బారావు.

భర్త మరణంతో విద్యావతి బ్రతుకు ప్రశ్నార్థకమైంది. ఇకపై తన పిల్లలిద్దర్నీ ఎలా సాకాలో తెలీడంలేదు. కిరణ్‌ది ప్రభుత్వోద్యోగం కానందున తగినంత ఆర్థిక సహాయం అందే అవకాశం లేదు.

"కిరణ్ కుటుంబాన్ని ఆదుకునే నిమిత్తం అతడి భార్యకు తక్షణ సహాయంగా కొంత మొత్తాన్ని వసూలుచేసి ఇవ్వాలని కాలనీ కమిటీ తీర్మానించింది. నీ వంతు మూడొందలు" అన్నాడు సురేంద్ర ఆఫీసులో సుబ్బారావు సీటువద్దకొచ్చి.

అతడి మాట పూర్తికాకుండానే జేబులోంచి మూడు వంద కాగితాలు తీసిచ్చాడు సుబ్బారావు.

ఆ సాయంత్రం ఆరు గంటలకు కిరణ్ సంతాప సభ ఏర్పాటు చేశారు.

కాలనీవాసులంతా చేరారు.

సుబ్బారావు ఒంటరిగా వెళ్ళాడు.

రుక్మిణి రానందుకు ఆమెనంతా రకరకాలుగా అనుకోవడం తన చెవిని పడడంతో అతడి మనస్సు చివుక్కుమంది. తప్పంతా తనదే రుక్కును కూడా పిలవవలసింది. రమ్మంటే వచ్చి ఉండేది. ఆమెతో చెప్పకుండా తనొక్కడు ఇలా రావడం పొరపాటే అనుకున్నాడు.

"మన సోదరుడు కిరణ్ ఆకస్మిక మృతికి సంతాప సూచకంగా లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం. అతని ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థిద్దాం" అన్నారు కమిటీ కార్యదర్శి.

అంతా లేచి నిలబడ్డారు.

మౌనానంతరం సభాధ్యక్షుడు కిరణ్ గుణగణాల్ని కొనియాడారు. తదనంతరం కాలనీవాసులు ఒక్కొక్కరు వేదిక మీదకొచ్చి కిరణ్ మంచితనాన్ని వేనోళ్ళ కొనియాడారు.

"కిరణ్ కుటుంబాన్ని ఆదుకోవడం కోసం మనం పోగుచేసిన సొమ్ము యాభై వేలయింది. అందుకు మీ అందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సందర్భంగా మరో ముఖ్యమైన విషయం-ఓ అజ్ఞాత అభిమాని పాతికవేలు విరాళమివ్వడంతో ఈ మొత్తం డెబ్భై ఐదువేలకు చేరుకుంది. ఆ వ్యక్తి తన పేరును ఎక్కడా ఉచ్ఛరించవద్దని వేడుకుంది. అయినా నా మనసు ఉండబట్టక చెప్పేస్తున్నాను. ఆ మహామనీషి ఎవరో కాదు. మన సుబ్బారావు గారి సతీమణి రుక్మిణమ్మగారు"

కార్యదర్శి ప్రకటన పూర్తి కాకుండానే సభలో చప్పట్లు మారుమోగాయి.

అమితాశ్చర్యపోయాడు సుబ్బారావు.

"ఇది నిజమా?!.." అన్నట్లు మహిళలలో కలకలం.

"దయచేసి సభికులంతా నిశ్శబ్దంగా ఉండాలి. ఇప్పుడీ డెబ్బైఐదువేల రూపాయలు రుక్మిణిగారి.చేతుల మీదుగా దివంగత కిరణ్ గారి సతీమణి విద్యావతి గారికి అందజేస్తాం" అన్నాడు అధ్యక్షుడు. అయితే ఆమె సభలో లేరని గ్రహించి "క్షమించండి రుక్మిణిగారు ప్రస్తుతం మనకు అందుబాటులో లేనందున ఆమె భర్త సుబ్బారావుగారొచ్చి ఈ మొత్తాన్ని విద్యావతికి అందజేస్తారు అన్నారు కార్యదర్శి.

కళ్ళు వత్తుకుంటూ విద్యావతి వేదిక మీదకు రావడంతోనే సుబ్బారావు ఆ పైకాన్ని చప్పట్ల మధ్య ఆమెకు అందజేశాడు.

సభ ముగియగానే మహిళలంతా అతడి చుట్టూ చేరి "రుక్మిణిగారిని మేం అపార్థం చేసుకున్నాం. మమ్మల్ని మన్నించాలి. మాతో ఆవిడ రాసుకు పూసుకు తిరగకపోవడంతో ఆమెకు గర్వమనుకున్నామే తప్ప అది ఆమె త్త్వమని తెలుసుకోలేకపోయాం. మన కాలనీవాసుల పట్ల ఆమెకున్న అభిమానం అమోఘం. మా అభిమానాన్ని మాటలతో చాటుకుంటే ఆమె తన చేతల ద్వారా వ్యక్తం చేశారు. మా అందరి తరపున మీరే ఆమెకు క్షమాపణ చెప్పాలి" అంటూ వేడుకున్నారు.

"సారీ సుబ్బారావ్. మీ ఆవిడ మంచి మనసును అర్థం చేసుకోలేకపోయాను. ఆమె ఉదార స్వభావాన్ని మేం ఇప్పుడే అర్థం చేసుకున్నాం. ఐ యామ్ సారి" చేతులు పట్టుకున్నాడు సురేంద్ర.

భార్య చేసిన మహోపకారానికి ఆమెనంతా ముక్తకంఠంతో పొగుడుతూ ఉంటే గర్వంగా ఫీలయ్యాడు సుబ్బారావు.

(జూలై 2008 "పత్రిక" మాస పత్రిక)

